JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 11-01-2026
Medchal - Malkajgiri | Sunday 11-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 226
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 226 | Pages : 8 | ₹: 5

## విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# భారత్ ను టార్గెట్ చేసిన ట్రంప్




✍ జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 10 :

ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు. వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్-300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు. వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ...మిగతాది 2 లో

# ప్రేమాయణం కథనాలపై ఐఏఎస్ అధికారుల ఆగ్రహం




- వైరల్ కథనాలపై చర్యలు తప్పవు

✍ జయభేరి, హైదరాబాద్, జనవరి 10 :

తెలంగాణ రాజకీయాల్లో, అధికార వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న ఓ టీవీ వార్తా కథనంపై అటు ఐఏఎస్ అధికారుల సంఘం, ఇటు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఒక రాష్ట్ర మంత్రికి, ఒక మహిళా ఐఏఎస్ అధికారికి మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ ప్రముఖ వార్తా సంస్థ ప్రసారం చేసిన కథనంపై తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ మేరకు సంఘం ఒక బహిరంగ లేఖను విడుదల చేస్తూ, సదరు వార్తా సంస్థ యాజమాన్యం తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఎంతో కష్టపడి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన మహిళా అధికారుల పట్ల ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని, ఇది అత్యంత గర్హనీయమని సంఘం పేర్కొంది. మంత్రి సిఫార్సుతోనే సదరు మహిళా అధికారికి ప్రత్యేక పోస్టింగ్‌లు లభించాయన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఐఏఎస్ ...మిగతాది 2 లో

# అమరావతిని వ్యతిరేకించడం లేదు అవినీతిని ప్రశ్నిస్తున్నాం

✍ జయభేరి, హైదరాబాద్, జనవరి 10 :



అమరావతిని జగన్ వ్యతిరేకించలేదని వైసీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. జగన్ ఇల్లు అమరావతిలోనే ఉందన్నారు. పెద్దపెద్ద భవనాలను కడుతూ ప్రజాధనం వృధా చేస్తున్నారనే జగన్ ప్రశ్నించారన్నారు. అమరావతి అనేది కేవలం ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని, అక్కడ చంద్రబాబు నాయుడు తన అనుకూల వర్గాలకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. జగన్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదన్నారు. జగన్ ఎప్పుడూ రాష్ట్రానికి ద్రోహం చేయలేదని స్పష్టం చేశారు. రాజధాని పేరుతో అక్కడ పెద్ద ఎత్తున భూ కుంభకోణాలు జరిగాయని, అవినీతి చోటు చేసుకున్నప్పుడు దానిని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అమరావతిని అభివృద్ధి చేస్తామంటున్న కూటమి ప్రభుత్వం, కేవలం గ్రాఫిక్స్‌తోనే కాలక్షేపం చేస్తోందని సజ్జల విమర్శించారు. చంద్రబాబు గతంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి ...మిగతాది 2 లో

## ఆత్మగౌరవానికి ఆధిపత్యానికి పోరాటమా..!?
## మళ్లీ ఆంధ్ర పంజా..!?
2 లో




# నాది డాక్టర్ లాంటి పాత్రనే..

HICCలో ఫెలోస్ ఇండియా కాన్ఫరెన్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నాను. భారత్ తో పాటు ఆగ్నేయాసియా దేశాల నుంచి 500 మందికి పైగా కార్డియాలజిస్టులు ఈ సదస్సులో పాల్గొనడం సంతోషదాయకం. నేను డాక్టర్ ను కాకపోయినా ముఖ్యమంత్రిగా సమాజ రుగ్మతలను పరిష్కరించడంలో నాది డాక్టర్ లాంటి పాత్రనే. ఈ కాన్ఫరెన్స్ హైదరాబాద్ లో జరగడం ఎంతో గర్వకారణం.

**గుండె సంబంధిత వ్యాధుల నివారించాలన్న లక్ష్యంతో అందరం కలిసి ఒక మిషన్‌గా పనిచేద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్డియాలజిస్టులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థులకు సీపీఆర్ చేయడంలో శిక్షణ ఇవ్వగలిగితే దేశంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామని అభిప్రాయపడ్డారు.**

✍ జయభేరి, హైదరాబాద్ :

ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న ఫెలోస్ ఇండియా కాన్ఫరెన్ 2026 లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, దక్షిణాసియా దేశాల నుంచి దాదాపు 500 మంది కార్డియాలజిస్టులు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తాను వృత్తి పరంగా డాక్టర్ కానప్పటికీ, నిర్వహిస్తున్న పదవీబాధ్యతల పరంగా సామాజిక వైద్యుడి పాత్ర పోషిస్తూ, సమాజంలోని సమస్యలకు చికిత్స అందిస్తానని చెప్పారు. CPR గురించి ప్రజల్లో అవగాహన కల్పించగలిగితే సమాజానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామని అన్నారు. "వైద్యులు మానవత్వం, సమాజం పట్ల బాధ్యతను ఎప్పుడూ మర్చిపోవద్దు. ప్రభుత్వ పరంగా ఆరోగ్య సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ విధానాలను మరింత మెరుగుపరచేందుకు మీలాంటి వైద్యులతో కలిసి పని చేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మీ సూచనలు, అభిప్రాయాలు అందించండి. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి నాణ్యత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలవాలి. సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అత్యుత్తమ వైద్యుడిగా ...మిగతాది 2 లో




# బస్టాండ్లు, రైల్వేస్టేషన్

తెలుగు వారికి పెద్ద పండగ సంక్రాంతి. ఎంత దూరంలో ఉన్నాసరే సంక్రాంతికి ఊరు వెళ్లాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉంటుంది. అందుకే సొంతూళ్లకు బయల్దేరే వారితో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రోడ్లు జామ్ అయ్యాయి. బతుకుదెరువు కోసం వచ్చి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఏదో వాహనం పట్టుకొని ఊరికి వెళ్దామని బయల్దేరడంతో ఆర్టీసీ బస్‌లు, ట్రైన్స్, ప్రైవేటు వాహనాలు అన్నీ కూడా కిటకిటలాడుతున్నాయి. ఇలా పట్టణాల నుంచి పల్లెలకు వెళ్తున్న జనంతో రోడ్లు కిక్కిరిసి పోగా, రైల్వేస్టేషన్లు, బస్టాండ్, విమానాశ్రయాలు కూడా రద్దీగా మారాయి.

✍ జయభేరి, హైదరాబాద్, జనవరి 10 :

ఏటా కనిపించిన దృశ్యాలే సీన్లే రిపీట్ అయ్యాయి. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో వాహనాలు బారులు తీరాయి. సంక్రాంతికి వెళ్లే వాహనాలతో టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్లు కొద్ది వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నా రద్దీని నియంత్రించడం అధికారుల వల్ల కాలేదు. టోల్ ప్లాజాల వద్దే కాకుండా హైదరాబాద్ శివారు ప్రాంతాలు, బెంగళూరు శివార్లలో ట్రాఫిక్ జామ్ జనాలకు చుక్కలు చూపిస్తోంది. ప్రస్తుతం ఈ ట్రాఫిక్ క్లియర్ అవ్వడానికి గంటల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి రద్దీని తట్టుకునేందుకు రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రెగ్యులర్‌గా నడిచే రైళ్లకు అదనంగా ట్రైన్స్ కలిపి మొత్తంగా 800లకుపైగా ట్రైన్స్‌ను నడుపుతోంది. వీటిలో కేవలం సంక్రాంతికి వెళ్లే వారి కోసమే 150కిపైగా ట్రైన్స్ రన్ చేస్తోంది. ఎన్ని ట్రైన్స్ నడుపుతున్నా ఊరికి వెళ్లే ప్రయాణికులకు మాత్రమే సీట్లు లభించడం లేదు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్లు పెట్టిన క్షణాల్లోనే ఫుల్ అవుతన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బెంగాల్, కర్ణాటక వెళ్లే ట్రైన్స్ కిటకిటలాడుతున్నాయి. ట్రైన్స్ ఏర్పాటు చేయడమే కాకుండా రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి తోడు ఆన్‌లైన్‌లో కూడా సాధారణ టికెట్ తీసుకునే ఫెసిలిటీ తీసుకొచ్చింది రైల్వే శాఖ. వీటిపై రాయితీ కూడా ఇస్తోంది. ట్రైన్స్‌లో టికెట్ దొరకని వారు బస్‌లవైపు చూస్తున్నారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రోడ్ రవాణా సంస్థలు ప్రత్యేక బస్‌లను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే తెలంగాణ ఎక్కువ స్పెషల్ బస్‌లను వేసింది. వాటికి స్పెషల్ ప్రైస్ పెట్టింది. ఆంధ్రప్రదేశ్ మాత్రం రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీస్‌లు నడుపుతోంది. గతంతో పోల్చుకుంటే ఈసారి ప్రత్యేక సర్వీస్‌లు ఎక్కువగా లేకపోవడంతో జనాలకు ప్రైవేటు ఆపరేటర్లు దిక్కు అయ్యారు. సంక్రాంతి రద్దీని ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## నాది డాక్టర్ లాంటి పాత్రనే..

ఎదిగేందుకు ప్రయత్నించాలి. వైద్యులు నిరంతరం నేర్చుకుంటూ, సేవలు అందిస్తూ ఎదుగుతూ ఉండాలి. చాలామందికి వైద్యులుగా మారే అర్హత సాధించలేరు. కానీ సమాజంలో మీరు ప్రత్యేకమైన గ్రూపు. మీ సంరక్షణలో ఉన్నప్పుడు మా ప్రాణాలకు ఎలాంటి ఢోకా లేదని మీపై నమ్మకం పెట్టుకుంటాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్, వాటి అనుబంధ రంగాల్లో హైదరాబాద్ ఒక హబ్‌గా శరవేగంగా ఎదుగుతోంది. ఇంతటి గొప్ప సదస్సు హైదరాబాద్‌లో నిర్వహించడం సంతోషంగా ఉంది. సదస్సులో పాల్గొన్న నిపుణులైన వైద్యులు, కార్డియాలజిస్టులు నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడానికి ఇక్కడికి రావడం అభినందనీయం. నిరంతర అభ్యాసం, కొత్త విషయాలను నేర్చుకోవడం ఆపిన రోజు మీరు మీ వృత్తికి ముగింపు పలికినట్టే. విజ్ఞానం, ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం ప్రపంచాన్ని శరవేగంగా మారుస్తున్నాయి. క్వాంటం కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికతలతో ఆరోగ్య సంరక్షణ అత్యంత హైటెక్ రంగంగా మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మీరంతా ఎప్పటికప్పుడు నిత్య విద్యార్థిలా అప్‌డేట్‌గా ఉండాలి.అయితే వైద్యులు మనుషులతో మమేకమయ్యే మానవీయ స్పర్శను కోల్పోవద్దు. ముఖ్యంగా వైద్యుల విషయంలో హైటెక్, అలాగే హైటచ్ రెండూ కలిసే నడవాలి..” అని ముఖ్యమంత్రి అభిలషించారు. సదస్సులో ఫెలోస్ ఇండియా ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్. ప్రతాప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ ఎ. శరత్ రెడ్డితో పాటు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## రష్..రష్ గా..

దృష్టిలో పెట్టుకొని సాధారణ ఛార్జీలే వసూలు చేయాలని ప్రైవేటు ఆపరేటర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా సరే ప్రైవేటు ఆపరేటర్లు మాత్రం ఇష్టం వచ్చిన ధరలకు టికెట్లు అమ్ముతున్నారు. రద్దీకి తగ్గట్టుగా అప్పటికప్పుడు రేట్లు ఫిక్స్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో రేటు తక్కువగా కనిపిస్తున్నా ఖాళీలు లేవన్నట్టు చూపిస్తున్నారు. సరే నేరుగా ఏదైనా బస్ దొరుకుతుందేమో అని చూస్తే అక్కడ కూడా భారీగా టికెట్ రేట్లు పెంచి అమ్ముతున్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రయత్నించి విఫలమైన మరికొందరు లాంగ్ డ్రైవ్ లాంటి యాప్ సహాయాన్ని తీసుకుంటున్నారు. అందులో వారం రోజులకు కార్లను బుక్ చేసుకుంటున్నారు. మరికొందరు షేరింగ్ ఫెసిలిటీ ఉందమో అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇలా ఏదో రకంగా ఊరుకు చేరిపోవాలని పండగను ఆనందంగా జరుపుకోవాలని చూస్తున్నారు.

## భారత్ ను టార్గెట్ చేసిన ట్రంప్

ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు.ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు.అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదననాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది.ట్రంప్-మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థానను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు.

## ఐఏఎస్ అధికారుల ఆగ్రహం

అధికారుల సంఘం స్పష్టం చేసింది. అధికారుల బదిలీలు మరియు పోస్టింగ్‌లు పూర్తిగా పరిపాలనాపరమైన నిర్ణయాలని, వాటికి వ్యక్తిగత సంబంధాలను ఆపాదించడం జర్నలిజం నైతికతకే విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేసింది. నైతికత లేని ఇలాంటి జర్నలిజం వల్ల సివిల్ సర్వెంట్లకు మరియు సమాజానికి చెడ్డ పేరు వస్తుందని, వెంటనే ఆ కథనాన్ని వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని ఆ చానల్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆరోపణలు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కూడా ఇబ్బంది పెట్టాయి. ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నన్ను ఏమైనా అనండి, నాపై రాజకీయ విమర్శలు చేయండి.. కానీ ఒక మహిళా అధికారిని ఈ వివాదంలోకి లాగి ఆమె పరువు తీయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారులను బదిలీ చేసే అధికారం కేవలం ముఖ్యమంత్రికి మాత్రమే ఉంటుందని గుర్తు చేస్తూ, తన కొడుకుని కోల్పోయిన బాధలో ఉన్న తనను , తన కుటుంబాన్ని ఇలాంటి అసత్య కథనాలతో మరింత వేదనకు గురిచేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారుతెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన చరిత్ర తనదని, అద్దె ఇంట్లో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న తనపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దురదృష్టకరమని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయాను.. ఇప్పటికైనా ఇలాంటి రాతలు ఆపండి, పైన దేవుడు ఉన్నాడు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ఈ వివాదం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

తెలంగాణలోని పలువురు ఐఏఎస్‌లపై వస్తున్న వార్తలను ఐఏఎస్‌ల అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. మహిళా అధికారుల పోస్టింగ్స్, వారి వ్యక్తిగత జీవితాలపై వస్తున్న కథనాలను పూర్తిగా ఖండిస్తున్నట్టు పేర్కొంది. ఇలాంటి వాటిని ప్రసారం చేసినవారిపై, సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం సర్క్యులేట్ అవుతున్న వాటిని తొలగించాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణారావు, కార్యదర్శి జయేష్ రంజన్ పేరుతో ఓ ప్రకటన విడుదలైంది. ఇందులో చాలా అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఐఏఎస్ అధికారులను టార్గెట్ చేస్తూ వస్తున్న వార్తలు తీవ్రంగా బాధిస్తున్నాయని వెల్లడించారు. అధికారుల వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న తప్పుడు ప్రసారం కారణంగా ప్రజల్లో చులకనభావన ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అధికారుల పని తీరుపై కూడా ప్రభావం చూపుతుందనే ఆందోళన ఈ ప్రెస్‌నోట్‌లో కనిపిస్తోంది. మహిళా అధికారులను కావాలనే టార్గెట్ చేస్తున్నట్టు అనిపిస్తోందని ఇది మంచిది కాదని హితవుపలికారు. ఇందులో మహిళలను కించపరిచేలా నెరేషన్ ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటివి రాసేటప్పుడు వారి వాదన కూడా వినకుండానే ఇష్టం వచ్చినట్టు ప్రసారం చేస్తున్నారని దీన్ని అసోషియేషన్ ఖండిస్తుందని అన్నారు. ఇలాంటివి తప్పుడు వార్తల ప్రసారం చేయడం, వాటిని వైరల్ చేయడం వల్ల సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయని అసోసియేషన్ అభిప్రాయపడింది. అందుకే వెంటనే వాటిని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. న్యాయపోరాటం చేస్తామని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటివి ప్రసారం చేసిన వాళ్లు షేర్ చేసిన వాళ్లకు న్యాయపరమైన చిక్కులు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

## అవినీతిని ప్రశ్నిస్తున్నాం

చేసిన వాగ్దానాలు ఏవీ నెరవేరలేదని, ఇప్పుడు మళ్ళీ అదే పద్ధతిని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. పారదర్శకత లేకుండా అక్కడ సాగుతున్న పనులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని, కేవలం భ్రమలు కల్పించడం ద్వారా ప్రజలను మోసం చేయలేరని ఆయన వ్యాఖ్యానించారు. అమరావతి రాజధానిని వరద ముప్పు ఉన్న ప్రాంతంలో నిర్మిస్తున్నారని జగన్ మోహన్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ విమర్శించారు. కృష్ణా నది గర్భానికి అత్యంత సమీపంలో, లోతట్టు ప్రాంతాల్లో భవనాల నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్తులో భారీ వరదలు వస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతంలో నిర్మించిన నివాసాల గురించి ప్రస్తావిస్తూ రాజధాని ప్రాంతంలో ఐదు అడుగుల మేర మట్టిని నింపి భారీ భవనాలు నిర్మించాల్సి రావడం వల్ల నిర్మాణ వ్యయం విపరీతంగా పెరుగుతుందని, ఇది ప్రజా ధనాన్ని వృథా చేయడమేనని జగన్ పేర్కొన్నారు. ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు. జగన్ అమరావతికి వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేస్తే సజ్జల అలాంటిదేమీలేదంటారు. మరొకరు మరో విధంగా ప్రకటన చేస్తారు. ఈ గందరగోళంపై వైసీపీ క్లారిటీ ఇవ్వకపోతే గందరగోళం అలాగే కొనసాగే అవకాశం ఉంది.

### ఆత్మగౌరవానికి ఆధిపత్యానికి పోరాటమా..!?

# మళ్లీ ఆంధ్ర పంజా..!?

- స్థానిక మున్సిపల్ ఎలక్షన్ లో జనసేన పార్టీ పోటీ..!?
- గోదావరిలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ ప్రజలు దిష్టి తాకిందట..!
- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలు తెలంగాణ ప్రజలు మర్చిపోయారా..!?
- ఆంధ్ర పెత్తనం వద్దనుకునే కదా తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుంది..!?
- ఏమరిస్తే మన ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టినట్టే..
- తెలంగాణ ప్రజలారా తస్మాత్ జాగ్రత్త..!?









కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

జయభేరి, హైదరాబాద్ :

సాధించిన తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ ఆంధ్ర మూలాలు చిగురింపజేస్తున్న రాజకీయ పార్టీలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకోవడానికి రాజకీయంగా పావులు కదుపుతున్నారు. స్థానిక తెలంగాణ మున్సిపల్ ఎలక్షన్లు దగ్గర పడుతుండడంతో తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత ప్రకటన చేయడం తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఏ దిశగా ఆలోచిస్తారనేది ఇప్పుడు అసలైన ప్రశ్నగా మిగులుతుంది. వందలాది మంది ప్రాణాలు బలి త్యాగం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సంపాదిస్తే మళ్లీ త్యాగాల తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర పార్టీలు అధికారం కోసం చేస్తున్న పన్నాగాలను తెలంగాణ ప్రజలు నిర్మొహమాటంగా తిప్పికొట్టాల్సిన సమయం ఇప్పుడు మన కాళ్ళ ముందర ఉంది. నిజానికి తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్న ఆంధ్ర నేతలు వారి రాజకీయ కుట్రలు ఇంకా తెలంగాణ మీద అక్కసు వెల్లబోసుకునేలా మరొక్కమారు స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందట... నిజానికి ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ గోదావరిలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ దిష్టి తాకిందని మాట్లాడిన ఆ పెద్దమనిషి మళ్ళీ తెలంగాణలో ఏ ముఖం పెట్టుకొని స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తాడు!? పూటకో మాట చెప్పే రాజకీయ నాయకుడిగా మారిపోయిన పవన్ కళ్యాణ్ ఈ మధ్యనే ఆంధ్ర ప్రేమను తెలంగాణ ప్రజలు పంచుకోవాలని సంక్రాంతికి ఇక్కడికి రావాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. అంటే అందినప్పుడు జుట్టు అందినప్పుడు కాళ్లు పట్టుకునే రకమా? ఎంతైనా ఆంధ్ర నేపథ్యం ఉన్న రాజకీయ నాయకుడిగా మారిపోయిన ఈ పెద్ద మనిషి ఎప్పుడు ఏం మాట్లాడుతాడు తాడు బొంగరం లేని వాడిగా మారిపోయారు.

తెలంగాణ రాష్ట్రంలో ఎవరైనా పోటీ చేయొచ్చు. కానీ మళ్లీ ఆంధ్ర మూలాలు గల రాజకీయ పార్టీని ఇక్కడ గెలిపించడానికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న తరుణంలో తెలంగాణ ప్రజలు ఏం ఆలోచించుకోవాలి... అభిమానం పేరుతో రాజకీయంగా ఓట్లు కొల్లగొట్టడానికి వస్తున్న ఆంధ్ర నేతల తల తిరిగేటట్టుగా సమాధానం చెప్పాలి. అభిమానం వేరు రాజకీయం వేరు.. భిన్న స్వరాలు గల తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రమూలాలు ఉన్న జనసేన పార్టీ ఏరకంగా విజయం సాధిస్తుందని గర్వంతో తులతూగుతుంది... అంటే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు తెలంగాణలో భారీగా ఉన్నారని వారి ఓటును కచ్చితంగా రాబట్టుకోవచ్చని ఆంధ్ర మూలాల రాజకీయ కుట్రలను మల్లొకసారి తెలంగాణ రాష్ట్రంపై పంజా విప్పేలా చేస్తుంది. పవన్ అభిమానులు అయితే రాజకీయంగా నెత్తిన కూర్చోబెట్టుకుంటారా..!?

పవన్ అభిమానులు తెలంగాణ రాష్ట్రంలోనే కాదు భారతదేశమంతా ప్రపంచం అంతా ఉండొచ్చు. అభిమానం అనేది విశ్వవ్యాప్తంగా ఉంటుంది. కానీ సాధించిన తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ జనసేన పార్టీ పేరుతో ఆంధ్ర నేతలు తెలంగాణలో అధికారాన్ని స్థానికంగా దక్కించుకుంటే ఆత్మగౌరవ పోరాటానికి అర్థం ఏముంటుంది? తెలంగాణ అంటేనే ఆత్మ బలిదానాల త్యాగాలకు స్వరూపం! రాష్ట్రం సాధించుకోవడానికి తెలంగాణ ఉద్యమంలో 369 మంది మలిదశ తెలంగాణ ఉద్యమంలో 1300 మంది తెలంగాణ బిడ్డలు అమరులైన ఆ జ్ఞాపకాన్ని ఏ చరిత్ర మరిచిపోదు! ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రమూలాలు గల ఏ పార్టీని గెలిపించకుండా తెలంగాణ ప్రజలు వివేకంతో వివేకంతో అడుగు ముందుకు వేయాలి. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఎవరో పుణ్యానికి ఇచ్చింది కాదు. పోరాడి కొట్లాడి తెగించి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం.... అన్ని రాష్ట్రాల్లోకెల్లా తెలంగాణ రాష్ట్రం విలక్షణమైనది విభిన్నమైనది. తెలంగాణ రాష్ట్ర భౌగోళిక ముఖచిత్రం ప్రజల జీవన విధానం సంస్కృతి సాంప్రదాయాలు ఇవేవీ తెలియని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో పాల్గొని విజయం సాధిస్తుంద!? నిజానికి తెలంగాణ ప్రజలు ముక్కుసూటిగా సమాధానం చెప్పాల్సిన సమయం! రాజకీయ పార్టీ దేశంలో ఎక్కడైనా పోటీ చేసుకునే అర్హత అధికారం రాజ్యాంగం కల్పించింది. ఆ రాజ్యాంగాన్ని అవసరానికి వాడుకునే ఆంధ్రమూలాలు గల రాజకీయ పార్టీలు ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో అదే రాజ్యాంగబద్ధంగా సాధించుకున్న రాష్ట్ర ప్రజలపై రాష్ట్ర సాంస్కృతికపై అకస్సు వెళ్లదీసే ఆంధ్రమూలాలు గల రాజకీయ పార్టీలు తెలుగు ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ తెలంగాణ సహజ సంపదను కొల్లగొట్టింది చాలక మళ్ళీ అభిమానం పేరుతో రాజకీయంగా లబ్ధి పొందుదామని ఇన్ని రాజకీయ కుట్రల?

తెలంగాణ రాష్ట్రం ఉద్యమాలకు ఊపిరి పోసిన ఈనెల.. సాహిత్య సంపదకు సహజ సంపదకు కొదువ లేనిది.. ఇక్కడి చరిత్రలు పోరాట పటిమకు నిదర్శనంగా నిలిచే గాథలు ఎన్నో ఎన్నెన్నో.. ఇక్కడి జీవన విధానం సాంస్కృతిక జీవనం విభిన్నమైనదిగా మరే రాష్ట్రంలో లేని సంస్కృతి సాంప్రదాయాలు గల రాష్ట్రంగా ఈ నేల పురిటి నొప్పులతో నిత్యం పోరాడుతూనే ఉంది.. ఇలాంటి త్యాగాల నేలపై అమరుల అస్తిత్వంపై దెబ్బ కొట్టిన ఆంధ్ర మూలాలు గల పార్టీలకు ఇక్కడ పెత్తనమా..!? అది స్థానిక మునిసిపల్ ఎలక్షన్లో పోటీ చేసేంత ఆ ధైర్యం ఎవరిచ్చారు? తెలంగాణ ప్రజలారా జాగ్రత్తగా ఆలోచించి ఆంధ్రమూలాలు గల రాజకీయ పార్టీలను తరిమికొట్టాలి? డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఒక్కసారి ఆలోచించండి.. గోదావరిలో కొబ్బరి చెట్లు పూర్తిగా తెలంగాణ ప్రజల దిష్టిదాకే అవి పాడైపోయాయి అన్న ఉపముఖ్యమంత్రి మాట తడుముకుంటూ సంక్రాంతి పండుగకు కోడిపందాలకు ఇక్కడికి వచ్చి తెలంగాణ ప్రజలు ఆంధ్ర ప్రేమను అందుకోండి పొందుకోండి అంటూ ఆహ్వానించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి.. ఆంధ్రాలో గెలవడానికి కూటమిలో ఒకటిగా ఏర్పడి జనసేన గెలిచినప్పటికీ అక్కడి పాలనలో తల మునకలవుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి ఏం సాధిస్తారు? అంటే మాకు తెలంగాణలో రాజకీయంగా భవిష్యత్తు ఉంది అని నిరూపించుకోవడానికి కాలు దువ్వుతున్న సందర్భం... తెలంగాణ ప్రజలారా స్థానిక మునిసిపల్ ఎలక్షన్ లో ఆలోచించి స్థానికులకే రాజకీయంగా అవకాశం దక్కేలా నిర్ణయం తీసుకోవాలి. స్థానికంగా ఉన్న వారిని రాజకీయాలకు అతీతంగా ఓటు వేసి గెలిపించుకోవాలి. అంతేకానీ అభిమానం ఉందని నెత్తిన పెట్టి ఊరేగితే సమస్యల సుడిగుండంలో ఎవ్వరు మనల్ని ఆదుకోరు.

తెలంగాణ రాష్ట్రం కొరకు 14 ఏళ్లు పోరాటం చేసి పోరాడి కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ ఆంధ్ర మూలాలు గల రాజకీయ పార్టీలు పంజా విసురుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రజలు సహనంతో వివేకంతో ఆలోచించి స్థానిక మునిసిపల్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. అంతేకానీ వెండితెర మీద నటించే నటులను హీరోగా భావిస్తూ అభిమానాన్ని ప్రాణం తీసేంతగా తలకు ఎక్కించుకోవద్దు. సినిమా అభిమానం వేరు రాజకీయ అభిమానం వేరు.. ఇప్పుడు ఇదేమి నందమూరి తారక రామారావు నాటి కాలం కాదు. మహానుభావుడిలా పరిపాలన చేసే సామర్థ్యం ఇప్పుడున్న నేతలు లేదు. స్థానిక ఎన్నికల్లో స్థానికులని పార్టీలకు అతీతంగా నిర్ణయించుకొని వారిని గెలిపించుకోవాలి. మన సమస్యలను మన సంక్షేమాన్ని మన అభివృద్ధిని కోరుకునే వాళ్లకే పట్టం కట్టాలి. అంతేకానీ గుడ్డిగా అభిమానానికి ఓటు వేసి మన మెడకు ఉరితాడని మనమే తయారు చేసుకోవద్దు...

## సృష్టి రహస్యంపై సరళమైన విశ్లేషణ



జయభేరి ఆధ్యాత్మిక శీర్షిక



Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

జయభేరి, హైదరాబాద్ :

తల్లి గర్భంలోనే ఆయుష్షు నిర్ణయించబడటం అనేది

**జీవన మహాద్భుతం:** సృష్టి రహస్యంపై సరళమైన విశ్లేషణ

**జీవన రహస్యం:** అణువులో అనంతం - చైతన్య ప్రయాణం

**1. గర్భవాసం :** ఒక చైతన్య శిల్పం తల్లి గర్భంలో అణువంత రూపం, పంచభూతాలను వడపోసి ఒక పరిపూర్ణ దేహంగా మారడం కేవలం జీవశాస్త్ర ప్రక్రియ కాదు; అది ఒక 'దివ్య సంకల్పం'.

**వేదోక్తి:** "అణోరణీయాన్ మహతో మహీయాన్" - అణువు కంటే సూక్ష్మమైన ఆత్మ, బ్రహ్మాండమంతటి శక్తిని తనలో నిక్షిప్తం చేసుకుని, గర్భంలో తనను తాను మలచుకుంటుంది.

**శాస్త్రీయ కోణం:** DNA అనే 'సృజనాత్మక గ్రంథం'లో కోట్లాది సంవత్సరాల పరిణామ క్రమం దాగి ఉంది. ఈ సృష్టిలో ఏ శిల్పి సాయం లేకుండా, తన అవయవాలను తానే నిర్మించుకునే ఈ 'సెల్యులార్ ఇంటెలిజెన్స్' ఆ విశ్వశక్తికి ప్రత్యక్ష నిదర్శనం.

**2. అన్వేషణలోని వెలితి:** ఆత్మశోధన మనకు కనిపిస్తున్న భౌతిక ప్రపంచం వెనుక ఏదో 'అదృశ్య హస్తం' ఉందనే భావనే ఆ వెలితికి కారణం. శరీరం కేవలం మట్టి. కానీ ఆ మట్టిని మాట్లాడించేది, కదిలించేది 'చిత్ శక్తి' మనం శరీరాన్ని ఒక యంత్రంలా చూస్తున్నంత కాలం ఆ వెలితి ఉంటుంది. ఎప్పుడైతే మనల్ని మనం ఒక 'విశ్వశక్తి తరంగం'గా గుర్తించగలమో, అప్పుడే ఆ పరిపూర్ణత లభిస్తుంది. ఈ శోధన కేవలం పుస్తకాల్లో లేదు, మన లోపలి మౌనంలో ఉంది.

**3. నిరంతర పరివర్తన:** కాలం - ఆయుష్షు జీవం అనేది నిశ్చలమైన కొలను కాదు, అది ప్రవహించే గోదావరి.

**నిరంతర మార్పు:** ప్రతి క్షణం పాత కణాలు మరణిస్తూ, కొత్త కణాలు పుట్టడం అనేది ఒక 'పునర్జన్మ'. వృద్ధాప్యం అనేది క్షీణత కాదు, అది ప్రకృతి సిద్ధమైన పరిణామం.

**ఆయుష్షు నిర్ణయం:** గర్భంలోనే ఆయుష్షు నిర్ణయించబడటం అనేది 'ప్రారబ్ధ కర్మ' యొక్క బ్లూప్రింట్. అయితే, యోగ సాధన ద్వారా ఈ కాలచక్రాన్ని ప్రభావితం చేయవచ్చని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. "మృత్యుంజయ" స్థితి అంటే మరణం లేకపోవడం కాదు, మరణాన్ని గెలిచే 'స్థితప్రజ్ఞత' సాధించడం.

**4. యోగుల అల్పాయుష్షు:** అగ్ని పునీత ప్రయాణం రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, శంకరాచార్యులు వంటి మహనీయులు తక్కువ కాలం జీవించడం వారి బలహీనత కాదు, అది వారి 'తీవ్రత'. ఒక సాధారణ దీపం కొన్ని గంటలు వెలుగుతుంది, కానీ ఒక మెరుపు ఒక్క క్షణం వెలిగినా చీకటిని చీల్చివేస్తుంది. వారిలో ప్రవహించిన 'జ్ఞానాగ్ని' భౌతిక శరీరం తట్టుకోలేనంత తీవ్రమైనది. వారు తమ కర్తవ్యాన్ని ముగించుకుని, 'స్వేచ్ఛా మరణం' పొందుతారు. వారి దృష్టిలో ఆయుష్షు యొక్క పొడవు ముఖ్యం కాదు, ఆ జీవితం కలిగించిన వెలుగు ముఖ్యం.

**సారాంశం:**

మనమంతా ఆ విశ్వశక్తి సముద్రంలోని చిన్న అలలం. గర్భంలో మొదలైన మన ప్రయాణం వృద్ధాప్యం దాటి అనంతంలో కలిసిపోయే వరకు సాగుతుంది. మనల్ని మనం మలచుకునే శక్తి మనలోనే ఉంది. మన ఆలోచనలే మనల్ని నిర్మిస్తాయి. "శరీరం ఒక వస్త్రం ఆత్మ ఒక ప్రవాహం విశ్వశక్తి ఒక సముద్రం. " ఈ సత్యాన్ని గ్రహించినప్పుడే మానవ జీవితం ధన్యమవుతుంది. ఈ మాటలు పది మందికి చేరినప్పుడు, వారిలో ఒక కొత్త ఆలోచనా దృక్పథం కలుగుతుందని ఆశిస్తున్నాను.

# ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

- రంగవల్లులు వేసి సందడి చేసిన మాజీమంత్రి మల్లారెడ్డి
- మేడ్చల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**జయభేరి, మేడ్చల్ :**

సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిహెచ్ఎంసి పరిధిలోని కిష్టాపూర్ పూడూర్ సర్కిల్ పరిధిలో గల కెఎల్ఆర్ వెంచర్ లో మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ నన్ను ఆదరిస్తున్న మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కరించి రుణం తీర్చుకుంటానన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో నిత్యం సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత పదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. ఇక రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని, ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎవరి దమ్ము ఎంతుందో చూసుకుందామని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు భాస్కర్ యాదవ్ కోల వెంకటేష్ శేఖర్ రెడ్డి బాబు యాదవ్ మాజీ కౌన్సిలర్ గణేష్ నర్సింగ్ గౌడ్ దయానంద్ యాదవ్ రాజ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆకిటి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు**

మన సంప్రదాయాలను భావితరాలకు అందజేయడం మనందరి బాధ్యత అని మేడ్చల్ మాజీ కో అప్షన్ సభ్యుడు ఆకిటి నవీన్ రెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ సర్కిల్ పరిధి పుడూర్కిష్టాపూర్ డివిజన్ లోని కెఎల్ఆర్ వెంచర్ లో నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు మాజీమంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చమకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ కాలనీల మహిళలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటుకున్నారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా బహుమతులు, చీరలను పంపిణీ చేశారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి గా రూ. 7 వేలు, మూడవ బహుమతి గా రూ. 5 వేలు అందజేశారు.

# సంక్రాంతి ముగ్గుల పోటీలు

**జయభేరి, ఘట్కేసర్ :**



జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ ఘట్కేసర్ సర్కిల్ 6వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురుకుల్ కళాశాల మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి. ఈ సందర్భంగా మల్లరెడ్డి మాట్లాడుతూ.. ఘట్కేసర్ సర్కిల్ 6వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పండగ వాతావరణంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజులలో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామని యువతీ యువకులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని మల్లారెడ్డి ట్రస్ట్ ద్వారా మరెన్నో కార్యక్రమాలు ముందు ముందు చేపడతామని ఆయన అన్నారు. మొదటి బహుమతి బోయిని సౌజన్య గాంధీనగర్, రెండవ బహుమతి ఉట్కూరి ఉజ్వల బాలాజీ నగర్, మూడవ బహుమతి శ్రీమిజ - ఘట్కేసర్ వారికి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు. మాజీ ఎంపిటిసిలు. మాజీ సర్పంచులు. మాజీ రైతు సహకార బ్యాంక్ చైర్మన్ లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు. మహిళలు ఉద్యమకారులు. యువజన సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ముగ్గులు

- సంక్రాంతి సంబరాల్లో సంస్కృతి పరిమళం
- విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా ముగ్గుల పోటీ జరిగింది. ముగ్గులు కేవలం కళాకృతులు కాదు, భక్తి, సంప్రదాయం, సాంఘిక ఐక్యతను ప్రతిబింబిస్తాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మాజీ ఎంపీపీ, ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ఉపాధ్యక్షురాలు సునీత రామ్మోహన్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగ అంటే పంట పండిన ఆనందంతో పాటు, ఇంటి ముందు వేసే ముగ్గులు మన భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయి. ముగ్గులు కేవలం రంగుల అలంకారం మాత్రమే కాకుండా, శుభ్రత, శుభప్రదత, భక్తి భావనకు ప్రతిరూపంగా భావించబడతాయి. తెల్లని పిండితో వేసే ముగ్గులు ప్రకృతి పట్ల కృతజ్ఞతను వ్యక్తపరుస్తూ, ఇంటి వద్దకు సానుకూల శక్తిని ఆహ్వానిస్తాయని పెద్దలు విశ్వసిస్తారు. అంతేకాక, ముగ్గుల ద్వారా కళాత్మకత, ఓర్పు, సాంప్రదాయ విలువలు తరతరాలకు చేరుతాయి. ఇలాంటి సంప్రదాయాన్ని నిలబెట్టే ఉద్దేశంతో విశ్వహిందూ పరిషత్ ఉప్పల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ, మహిళలు మరియు యువతలో సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంచినట్లు స్పష్టమైంది. ఈ కార్యక్రమం సంక్రాంతి పండుగకు మరింత ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవాన్ని చేకూర్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముక్త నాగ రమేష్ నాయుడు, గంగుల సునీత రెడ్డి, దుర్గ వాహిని జిల్లా సంయోజిక కృష్ణవేణి, జిల్లా కార్యదర్శి తాండూరు రమేష్, పీర్జాదిగూడ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కార్యకర్తలు మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు

**జయభేరి, సైదాపూర్ :**








జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు సిపి గౌస్ అలం ఆదేశాల మేరకు సైదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం ఎస్సై కొప్పుల స్వాతి ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచులు మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. అందంగా ఆకర్షణీయంగా వేసిన ముగ్గులకు బహుమతులు ప్రకటించారు. హుజురాబాద్ రూలర్ సిఐ పులి వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో విజేతలు బహుమతులను మొదటి బహుమతి దుద్దెనపల్లి గ్రామం, రెండవ బహుమతి వెన్కెపల్లి, మూడవ బహుమతి లక్ష్మన్న పల్లి, నాలుగవ బహుమతి, సైదాపూర్, పెర్కపల్లి గ్రామం విజేతలకు బహుమతి సీఐ పులి వెంకట్ గౌడ్ అందజేశారు. ప్రతి గ్రామంలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు ఫోరం అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, సర్పంచులు మునిగంటి స్వప్న, సంతోష్, మునిపాల సునీత రవి, రాయిశెట్టి చంద్రయ్య, తొంట రజనీకాంత్, మాచమల్ల, శ్రీకాంత్, బత్తులసంపత్, ఉడిగే, విజయరాజ శేఖర్, వర్నెలావణ్య, భాషరాజు రజిత, మదం శ్రావణి శ్రీనివాస్, పోతారాజు బాబితా, ఉపసర్పంచి, గోప గోనినవీన్, కుమారస్వామి, పోలీస్ శాఖ సిబ్బంది చట్ల ఆంజనేయులు, సముద్రాల సురేష్, బొజ్జ రాజు, జంపయ్య, సాయి కృష్ణ, అజయ్ కుమార్, స్రవంతి, పూజ, నాగరాణి మహిళలు తుదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్తు వాడకంపై తగు సూచనలు

**జయభేరి, సైదాపూర్ :**

దుద్దెనపల్లి గ్రామంలో జరిగిన ప్రజా బాట కార్యక్రమంలో సైదాపూర్ AE శ్రీనివాస్, sli సుధాకర్ లైన్మెన్ రవి జేఎల్ఎం కుమారస్వామి, అఖిల్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. రైతులకు విద్యుత్తు వాడకంపై తగు సూచనలు, అలాగే జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరిగింది.


# బస్సులు కిటకిట



**జయభేరి, మేడ్చల్ :**

సంక్రాంతి పండుగ సందర్భంగా ఉప్పల్ ఎక్స్ రోడ్ నుండి సుమారుగా 400 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశామని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇంకా బస్సులను అందుబాటులో తీసుకువస్తామని వరంగల్ 1 డిపో మేనేజర్ అర్పిత తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు లాంటి అన్ని ఏర్పాట్లను చేశామని తెలిపారు. 3 వంతుల మహాలక్ష్మి కి వెళ్లే ప్రయాణికులు ఉన్నారని ఒక వంతు మాత్రమే డీలక్స్ లాంటి బస్సులో వెళ్తున్నారని తెలిపారు.

# ఉద్యోగాల పేరిట భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



**జయభేరి, అదిలాబాద్ :**

ఆదిలాబాద్ పోలీసులు ఉద్యోగాల పేరిట భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం, అనంత్ ఈ సొల్యూషన్, విద్యాదాన్ ఎన్జీవో పేర్లతో నిరుద్యోగులను మోసం చేస్తున్న మధు కిరణ్, సుధాకర్, సతీశ్లను శనివారం అరెస్టు చేశారు. కేంద్ర ప్రభుత్వ సిఎస్ఆర్ నిధులను కాజేయాలనే లక్ష్యంతో ఈ నకిలీ నియామకాలు జరిపినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

# స్వగ్రామం చేరిన యువతుల మృతదేహాలు

**జయభేరి, మహబూబాబాద్ :**

అమెరికాలోని కాలిఫోర్నియాలో 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు యువతులు మేఘన, భావన చనిపోయిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూర్ గ్రామానికి చేరుకున్నాయి. స్వగ్రామంలో యువతులకు అంతిమ సంస్కారాలు జరగనున్నాయి. దీంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.



# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి డివిజన్ పరిధిలోని DC కాలనిలో పర్యటించారు. డిసి కాలనీలో భూగర్భ డ్రైనేజీ, కొత్త సి సి రోడ్లు మంజూరు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డిసి ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మెంబర్స్ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని దశలవారీగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు వంటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రంగోలి పోటీల్లో మహిళల ఉత్సాహం



**జయభేరి, ఉప్పల్ :**

హబ్సిగూడ డివిజన్ పరిధిలోని సాయి సుకా విస్తాలోని బాస్కెట్ బాల్ కోర్టులో శనివారం నిర్వహించిన SSV స్వీట్ లేడీస్ రంగోలి పోటీలు-2026 ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహిళల్లోని సృజనాత్మకతను వెలికితీసే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి సానుకూల సందేశం ఇస్తాయని పేర్కొన్నారు. సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందిస్తూ మహిళలకు వేదిక కల్పిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ రంగోలి పోటీల్లో అనేక మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల రంగోలీలతో ఆకట్టుకున్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని రజితా రెడ్డి (బీఆర్ఎస్), హబ్సిగూడ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, BRS పార్టీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు





**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ లోని కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా!! డి. శ్రీనివాస రెడ్డి (Director of CSIR IICT Hyderabad), ప్రత్యేక అతిథిగా ఆశ్రిత వేముగంటి నందూరి (Clasical Dancer, Tollywood actress & speaker) విచ్చేశారు. పాఠశాల వ్యవస్థాపకులు కేవల్ చంద్, కిరణ్, నిర్వాహకులు రితేష్, రూపేష్, ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి రెడ్డి, HM తనుశ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదట విద్యార్థినీ విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. చక్కటి నాట్య ప్రదర్శనలతో, నాటకాలతో అందరినీ అలరించారు. అతిథులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, స్ఫూర్తిదాయకమైన విషయాలను అందజేశారు. ఈ పాఠశాలలో 10 వసంతాలు, ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు.

# రాజకీయాల్లో మహిళలు భాగస్వామ్యం కావాలి

- మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్
- ఘనంగా ఏ బ్లాక్ అధ్యక్షురాలు కోమలత పుట్టినరోజు వేడుకలు



**జయభేరి, మేడ్చల్ :**

రాజకీయాల్లో మహిళలు భాగస్వామ్యం కావాలని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్ అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షురాలు కోమలత పుట్టినరోజు వేడుకలలో వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కోమలతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ లను ఆదర్శంగా తీసుకుని నేటితరం మహిళలు రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచి లు భేరి ఈశ్వర్, బండారి నరేందర్, మాజీ కౌన్సిలర్లు జకట దేవా, మల్లేష్ గౌడ్, చాపరాజు, నాయకులు కృష్ణారెడ్డి, సాయిపేట మల్లేష్, రంజిత్, సంపత్ యాదవ్, ఉదయ్ గౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియాకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి

- డా. ఖాళీ ప్రసాద్ బీజేపి కాంటెస్ట్ ఎమ్మెల్యే
- చిరు వ్యాపారులకు కాంప్లెక్స్ పూర్తి చేయాలి
- పరకాల పట్టణ అభివృద్ధి పై బహిరంగ సవాల్

**జయభేరి, పరకాల, జనవరి 10:**

పరకాల బస్టాండ్ ఆవరణలో చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పించేలా నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్‌ను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ కాంటెస్ట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. బస్టాండ్ పరిసరాల్లో ఇటీవల జరిగిన మహిళ మృతి ఘటన బాధాకరమని, ఇందుకు కారణమైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. శనివారం పరకాల బీజేపీ పట్టణ కార్యాలయంలో అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాజీ ఎమ్మెల్యే చిరు వ్యాపారుల కోసం కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రారంభించి మధ్యలోనే వదిలేశారని, ప్రస్తుతం ఎమ్మెల్యే పదవిలో ఉన్న వారు రెండేళ్లు పూర్తయినా దానిపై కనీసం తట్టెడు మట్టికూడా వేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు ఆర్థికంగా నష్టపోకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



**మీడియాకు బహిరంగ క్షమాపణ చెప్పాలి**

ప్రజల పక్షాన నిలబడి పోరాడే మీడియా మిత్రులపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకారంమని డా. కాళీ ప్రసాద్‌రావు అన్నారు. అలాంటి వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని విలేకరులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియానే ఎమ్మెల్యేలను ప్రజల ముందుకు తీసుకొచ్చిందని, అలాంటి వారిపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరమని విమర్శించారు.

**అభివృద్ధి ఎక్కడ?**

రెండేళ్ల పాలనలో పరకాల నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని ఆయన సవాల్ విసిరారు. పరకాల అభివృద్ధి పూర్తిగా భ్రష్టు పట్టిందని, గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత పాలనలోనూ ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పరకాల అభివృద్ధి చెందాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. పునర్విభజనలో పరకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా లేదా జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని, నిధులు మంజూరు చేసి విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు ఆర్పి జయంత్ లాల్ కోలనుపాక భద్రయ్య పూర్ణచారి, చందుపట్ల రాజేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి జిల్లా నాయకులు సిరంగి సతీష్ కుమార్, కుక్కల విజయ్ కుమార్, మార్తా బిక్షపతి, బండి రవి, మార్త రాజభద్రయ్య, బాసాని సోమరాజు, రాజవీరు, దంచనాల సత్యనారాయణ, మహిళా నాయకురాలు వేలిశెట్టి శారద, సదారాణి, దంచనాల కిరణ్, కోడెల లింగమూర్తి, పైండ్ల రంజిత్, కానుగుల గోపీనాథ్, బూత్ అధ్యక్షులు ముత్యాల దేవేందర్, ఆకుల శ్రీధర్, సాద మధుకర్, తడుక విక్రమ్, దాసరి వెంకటేశ్వర్లు, ఉడుత చిరంజీవి, కృపేందర్ రెడ్డి, బీరం రాజు రెడ్డి, సారంగా నరేష్, కాగితపు చంద్రమోహన్, గునిగంటి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



# యువత వ్యాపార రంగాల్లో రణించాలి

**జయభేరి, మేడ్చల్ :**

యువత ఉద్యోగాల కోసం వేచి చూడకుండా స్వయం ఉపాధితో ఎదగాలని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం మేడ్చల్ సర్కిల్ పరిధి గుండ్లపోచంపల్లి డివిజన్ లోని బసురేగడిలో ఏర్పాటు చేసిన టి స్టాల్ ను వజ్రేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత కష్టపడి పనిచేసి వ్యాపార రంగాలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నర్సింలు యాదవ్, గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచి లు భేరి ఈశ్వర్, బండారి నరేందర్, మాజీ కౌన్సిలర్లు చాపరాజు, జకట దేవా, మల్లేష్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, కుండ బానుచందర్, మహేందర్ వర్మ, ఉదయ్ గౌడ్, సంపత్, ప్రవీణ్, కోమలత, రంజిత్, సంపత్ యాదవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# జీతం డబ్బులు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్న


- లోటస్ హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రాజు డిమాండ్




**జయభేరి, షాద్ నగర్, జనవరి 10 :**

షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని బీపీకే లోటస్ హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. రాజు ఓ ప్రకటనలో తెలిపారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అరవింద హాస్పిటల్ ఫార్మసీ లో పనిచేస్తున్న వ్యక్తికి జీతం సరిగ్గా ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతూ పనిచేచేయించుకుంటున్నారని తెలిపారు. హాస్పిటల్ ఫార్మసీలో పనిచేసే వ్యక్తిని 12 గంటలకి పైగా పనిచేయించుకుంటూ 42 రోజులలో ఒక్కసారి కూడా వీక్లీ ఆఫ్ ఇవ్వకుండా, తీవ్ర ఒత్తిడితో పనిచేయించుకుంటున్నారనీ, నలుగురు చేయాల్సిన పనిని ఒక్కడితోనే చేయిస్తూ, కనీసం కుటుంబ ఆనారోగ్య కారణాల వలన 2 రోజులు సెలవు అడిగితే 3 రోజులు సాలరీ కట్ చేస్తానని బెదిరించడమే కాకుండా, జీతం అడిగితే ఇవ్వను అని మేనేజింగ్ డైరెక్టర్ అరవింద బెదిరింపులకు పాల్పడుతుందని ఆరోపించారు. గత రెండు నెలల్లో నాలుగురు ఫార్మసిస్ట్ లు మారారు అంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెంటనే బాధితునికి కావాల్సిన డబ్బులను ఇవ్వాలని లేనిచో లోటస్ హాస్పిటల్ ఆవరణలో ఆందోళన పోరాటానికి దిగుతామని బాధితుల పక్షాన ఆందోళన చేస్తామని ఆయన డిమాండ్ చేశారు.

# గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బంది నిర్లక్ష్యం



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 10 :**

అర్ధరాత్రి పురిటి నొప్పులతో తల్లడిస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళకు తీవ్ర నిరాశ ఎదురైంది. వివరాల్లోకి వెళ్తే తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బండారి సద్గుణ అనే గర్భిణి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నొప్పులు ఎక్కువ అవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడ డోర్ బంద్ చేసి ఉందని, ఏ ఒక్క వైద్యులు అందుబాటులో లేరని, సిబ్బంది పట్టించుకోలేదని గర్భిణీ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఉన్న వారికే ఇలా ఉంటే మారుమూల గ్రామాల ప్రజలకు ఎలాంటి పరిస్థితి ఉందోనని ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా కలెక్టర్, అధికారులు హాస్పిటల్ పై దృష్టిసారించి మండల ప్రజలకు అందుబాటులో 24 గంటల వైద్య సేవలు అందేలా చూడాలని హాస్పిటల్ స్థితిగతులపై ఎంక్వైరీ చేసి బాధ్యతారహితంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# డ్రగ్స్, గంజాయి పై కళాబృందంచే అవగాహన



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 10 :**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో పాటల, నాటికల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి అలవాట్లు పడి యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అట్టివారు ఈ కళాజాతను చూసి మార్పు తెచ్చుకోవాలని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులకు వాడే మాంజా వాడడం వల్ల ప్రాణనష్టం జరుగుతుందని అది గ్రహించి ప్రజలు మాంజాను నిషేధించాలని కోరారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని, కానీ విషాదం దారి తీయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ఎండీ జహంగీర్, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మా ఊరి రోడ్డు బాగు చేయరా సార్

**డిండి :**

డిండి మండలంలో వావిల్ కోల్ వడ్డెర గూడెం నుండి బ్రాహ్మణపల్లి నుండి తండా బీటీ రోడ్డును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఓర్సు ముత్యాలు అధికారులకు కోరారు ఇప్పటికైనా ఈ రోడ్డు వాహనదారులు ప్రజలు రైతులు ప్రయాణం చేయాలంటే చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు కంకర డస్ట్ పోసి అలాగే వదిలేశారని బిటి చేయడం మర్చిపోయారని చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు ప్రజా ప్రతినిధులు చూపిస్తున్నారా అని ఆయన అన్నారు దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని రోడ్డు బాగు చేసే విధంగా చూడాలని ఈ గ్రామంలో ఉన్న ప్రజలందరూ సంతోషపడతారని కోరుకుంటున్నాము అదేవిధంగా ఓర్సు ముత్యాలు కోరారు.

# ఓటర్ లిస్టులలో అన్ని తప్పు లే



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ ఓటర్ లిస్ట్ లలో అన్ని తప్పుల కుప్పగా మారింది. ఓటర్ లిస్ట్ లో ఇతర గ్రామాల ఓట్లు కలిసాయి, స్థానిక 19 వార్డులో సరియగు వార్డు బౌండరీ ని నిర్ధారించకుండ పోవడంతో ఒక వార్డ్ లోని ఓట్లు ఇతర వార్డు లోకి ముద్రించబడ్డాయి. దీనితో ఓటర్లు తీర్వమైన ఇబ్బందికి గురి అవుతారు. దీనిపై మున్సిపల్ కమిషన్ కి వినతి పత్రం ఇచ్చిన కూడా తప్పులతో నే ఓటర్ లిస్ట్ ముద్రించినారు. మున్సిపల్ కమిషనర్ పై తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు న్యాయం జరిగే వరకు ధర్నా చేస్తాం అని బీఆర్ యస్ పార్టీ నాయకులు ఖాదర్ బాబా హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల పోరాట సమితి కన్వీనర్ జరుపుల లోకియా నాయక్ ఉద్యమకారులను ఆదుకోవాలి అని తెలియజేసినారు. తెలంగాణ అమరవీరుల కుటుంబానికి ఒక ఉద్యోగం, 500 గజాల ఇంటి స్థలం తో పాటు నెలకు 30 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 500 గజాల ఇంటి స్థలంతో పాటు నెలకు 20వేల రూపాయల ఉద్యమ పెన్షన్ ఇవ్వాలి. ఉద్యమకారులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డు ఇవ్వాలి. ఆర్టీసీ బస్సులలో ఫ్రీగా బస్ పాస్ సౌకర్యం కల్పించాలి. రైల్వే, విమాన ప్రయాణాలలో ప్రత్యేకంగా రాయతీలు కల్పించాలి. ఉద్యమకారులకు నామినేటెడ్ పోస్టులు కల్పించాలి. ఈ పై ఆరు డిమాండ్లు సాధించడం కొరకై రాష్ట్రంలోని ఉద్యమకారులు పోరాటం చేసి మన హక్కులను సాధించాలని ఉద్యమకారులకు తెలియపరచుచున్నాము అని తెలియజేసినారు.

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- పొంగిపొర్లుతున్న మురుగు నీరు.. దుర్వాసనతో ప్రజల ఇక్కట్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

**జయభేరి, మేడ్చల్ :**



అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ వల్ల మురుగునీరు రోడ్లపై ఏరులై పడుతున్న అటువైపు చూసిన నాధుడే లేదని మేడ్చల్ సర్కిల్ పరిధిలోని చంద్ర నగర్ ప్రజలు వాపోతున్నారు. చంద్ర నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 6 లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లు మురికి నీటి కాలువలుగా మారుతున్నాయి. డ్రైనేజీ మ్యాన్ హోల్స్ నుండి మురుగునీరు బయటకు రావడంతో గుంతలుగా ఉన్న రోడ్లపై నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


**సమస్యను పరిష్కరించాలి:- స్థానికులు**

మేడ్చల్ సర్కిల్ చంద్ర నగర్ కాలనీలో మురుగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. పన్నుల విషయంలో ప్రజల నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు ప్రజల మౌలిక వసతులు కల్పించాలన్నారు. కాలనిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదదని ఇందుకు పొంగిపొర్లుతున్న మురుగునీరు నిదర్శనం అన్నారు. గత వారం రోజులుగా మ్యాన్ హోల్స్ నుండి మురుగునీరు రోడ్లపై ఏరులై పరుతున్న పారిశుద్ధ్య సిబ్బంది ఇటు వైపు చూడటంలేదని స్థానికులు విమర్శించారు. రోడ్లపై నిల్వ ఉన్న మురుగునీరు వల్ల దోమల వ్యాప్తి పెరిగి తాము వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- షాద్ నగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రజలకు సూచనలు
- సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా పోలీసు అధికారుల సూచనలు పాటించండి
- షాద్ నగర్ సీఐ విజయ్ కుమార్

**జయభేరి, షాద్ నగర్, జనవరి 10 :**



సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తమ స్వస్థలాలకు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో, ఖాళీగా ఉండే నివాస గృహాల్లో దొంగతనాలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాలు జరగకుండా నివారించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ ప్రజలకు ఈ క్రింది భద్రతా సూచనలు జారీ చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు పత్రికా ప్రకటనను షాద్ నగర్ పట్టణ విజయకుమార్ విడుదల చేశారు.

పలు సూచనలు సలహాలను ఆయన ప్రకటనలో పేర్కొంటూ.. ఇల్లు వదిలి వెళ్లే ముందు తలుపులు, కిటికీలు, గ్రిల్లులు అన్నింటిని బలమైన మరియు నమ్మదగిన తాళాలతో సురక్షితంగా తాళం వేయాలి. నగదు, బంగారు ఆభరణాలు మరియు ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి. ప్రధాన ద్వారం వద్ద తెరలను ఉపయోగించి తాళాలు బయటికి కనిపించకుండా, అన్యుల దృష్టికి రాకుండా చూడాలి. సాధ్యమైనచోట ఆటోమేటిక్ టైమర్లను ఉపయోగించి లైట్లను కొంత కొంత వ్యవధిలో వెలిగేలా చేసి, ఇల్లు ఖాళీగా లేదన్న భావన కలిగించాలి. సాధ్యమైతే పండుగ సెలవుల సమయంలో ఇల్లు ఖాళీగా ఉండకుండా భద్రత కోసం సమీప బంధువులు లేదా కుటుంబ మిత్రులను ఇంట్లో ఉండమని కోరాలి. విశ్వసనీయమైన పొరుగువారికి సమాచారం ఇచ్చి, మీ గైర్హాజరీలో ఇంటిపై నిఘా ఉంచమని అభ్యర్థించాలి. అపార్ట్మెంట్లు, నివాస సముదాయాలు మరియు గేటెడ్ కమ్యూనిటీలలో నివసించే వారు అక్కడి భద్రతా సిబ్బంది, వాచ్మెన్ లేదా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లను తమ నివాసంపై కుణ్ణంగా నిఘా ఉంచేలా కోరాలి. మీ ప్రయాణ ప్రణాళికలు లేదా ఇంట్లో లేనన్న వివరాలను సోషల్ మీడియా వేదికలపై పంచుకోకూడదు. భద్రతా సిబ్బంది వాచ్మెన్ తమ ప్రాంతంలోకి ప్రవేశించే అనుమానాస్పద లేదా తెలియని వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా విచారించి గుర్తింపు ధృవీకరణ చేయాలి. హాస్టల్ వార్డెన్లు మరియు లాడ్జ్ యజమానులు అనుమతి లేని వ్యక్తులను తాత్కాలికంగానైనా ఉండనివ్వకూడదు; ప్రతి నివాసితుడి గుర్తింపును ధృవీకరించి సరైన రికార్డులు నిర్వహించాలి. సీసీటీవీ కెమెరాలు, అలారం వ్యవస్థలు, ఇతర భద్రతా పరికరాలు ఏర్పాటు చేసి, అవి సరిగా పనిచేస్తున్నాయో లేదో నిర్ధారించుకోవాలి. వాహనాలను సురక్షితమైన, భద్రమైన మరియు వెలుతురు ఉన్న ప్రదేశాల్లో మాత్రమే పార్క్ చేయాలి. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలి. తద్వారా పోలీసులు తక్షణమే స్పందించగలుగుతారు పేర్కొన్నారు.

# సర్పంచులకు సన్మానం

**జయభేరి, తుర్కపల్లి, జనవరి 10 :**



తుర్కపల్లి మండలం గ్రామపంచాయతీ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలో గెలుపొందిన సర్పంచులను సన్మానించారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రం సర్పంచ్ సోమల వెంకటేశం, దత్తాయిపల్లి సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, గంధ మల్ల సర్పంచ్ బొత్త రాములు, ములకలపల్లి సర్పంచ్ బానోతు బులి వీరన్న, మల్కాపూర్ సర్పంచ్ సోన్నాయిల రఘు, వాసాలమర్రి సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, తిరుమల పురం గ్రామ సర్పంచ్ దొనికెన రేణుక వెంకటేష్ యాదవ్, చిన్న లక్ష్మాపురం సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, ధర్మారం సర్పంచ్ ధనావత్ రజిని, గొల్లగూడెం సర్పంచ్ ధనావత్ రమేష్ లను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు కసిర బోయిన శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సర్పంచులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పల్లెపాటి లక్ష్మీనరసింహ, ఉపాధ్యక్షులు బూసి శేఖర్, ప్రధాన కార్యదర్శి పలుగుల ప్రశాంతి, కోశాధికారి తుటి కృష్ణ, వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# లింగారెడ్డి గూడాలో క్రీడా సంబరం

- ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించిన మాజీ ఎంపీపీ చల్ల వెంకటేశ్వర్ రెడ్డి
- ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీకాంత్ రెడ్డి
- లింగారెడ్డి గూడా గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ అశోక్
- యువతకు క్రీడలే భవిష్యత్తు మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, జనవరి 10 :**

రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం లింగారెడ్డి గూడా గ్రామం క్రీడా ఉత్సాహంతో మార్మోగింది. గ్రామ యువత ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో నిర్వహిస్తున్న లింగారెడ్డి గూడా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ను మాజీ ఎంపీపీ చల్ల వెంకటేశ్వర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ ఫరూఖ్ నగర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్ (రాజు)డిప్యూటీ సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ టోర్నమెంట్ నిర్వాహకులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. మాజీ ఎంపీపీ చల్ల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆయన అన్నారు. ఫరూఖ్ నగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ యువత, క్రీడలు, విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు అవసరమైన వసతులు కల్పించడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందన్నారు. క్రీడల ద్వారా యువతను నశన మార్గాల నుంచి దూరం చేసి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే కాంగ్రెస్ పార్టీ ఆశయమని తెలిపారు. లింగారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. లింగారెడ్డి గూడా గ్రామాన్ని కేవలం మౌలిక వసతులకే పరిమితం కాకుండా, యువతకు క్రీడల ద్వారా అవకాశాలు కల్పించే గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు.గ్రామంలో క్రీడా వాతావరణం పెంపొందించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. లింగారెడ్డి గూడా గ్రామ డిప్యూటీ సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ మాట్లాడుతూ.. గ్రామ యువతను సరైన దిశలో నడిపించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పోటీ తత్వం పెరుగుతాయని తెలిపారు. లింగారెడ్డి గూడా గ్రామంలో యువతకు అవసరమైన క్రీడా వసతులు కల్పించేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు అన్నారు. గ్రామంలోని యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఉత్సాహం చూపించారు. క్రీడా వాతావరణం గ్రామమంతా సందడిగా మారగా, ప్రేక్షకులు ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.ఈ టోర్నమెంట్ లింగారెడ్డి గూడా గ్రామానికి గర్వకారణంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లేష్‌యాదవ్,గ్రామ పెద్దలు, కందూరి అంజయ్య గౌడ్,పంతులు లక్ష్మయ్య, రంగంపల్లి రమేష్‌గౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి,భూపతి రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాల్నగర్ యాదయ్య, గంటెల శంకరయ్య, హరికృష్ణ యాదవ్, మంగలి మల్లేష్, సాదక్ పాషా, నరేందర్ రెడ్డి, సామల వెంకటయ్య, ఖదీర్, రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాభిమానులు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గుప్త నిధులతో తవ్వకాలు

**ఆరుగురి అరెస్ట్**

**జయభేరి, తుర్కపల్లి, జనవరి 10 :**



తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామ శివారులో గుప్త నిధుల కోసం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న ఆరుగురు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై మహమ్మద్ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు గుప్త నిధుల కోసం త్రవ్వకాలు జరుపుతున్నారని సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా సంఘటన స్థలానికి చేరుకొని ఆరుగురు నిందితులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి ఒక హిటాచి (జెసిపి), ఒక కారు, క్షుద్ర పూజల కోసం ఉపయోగించిన పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో పులి కుమారస్వామి (ఈసీఐఎల్), రామినేని కృష్ణ కిషోర్ (విజయవాడ), పాగోలు శ్రీనివాస్ (విజయవాడ), ఆకుల నరసింహారావు (విజయవాడ) తాత కృష్ణ కాంత్ (ఖమ్మం), పల్లపు వేణు(బొమ్మలరామారం) ఉన్నారని తెలిపారు. ప్రజలు ఎవ్వరు మూఢనమ్మకాలు క్షుద్ర పూజలను నమ్మి మోసపోవద్దని అన్నారు. అక్రమంగా గుప్త నిధుల తవ్వకాలు జరపడం చట్టరీత్య నేరమని, ఎక్కడైనా ఇలాంటి అనుమానాస్పద త్రవ్వకాలు లేదా క్షుద్ర పూజల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అన్నారు.

# ఒకే రోజు.. ఒకే ఊరిలో మూడు దొంగతనాలు

**జయభేరి, మేడ్చల్ :**

ఒకే రోజు ఒకే ఊరిలో ఓ దుండగుడు మూడు చోట్ల దొంగతనాలకు పాల్పడి అందినకాడికి నగదును దోచుకెళ్ళిన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపూర్లో చోటుచేసుకున్నాయి. గ్రామంలోని మూడు చోట్ల ఒకే రోజు దొంగతనం జరగగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. లక్ష్మాపూర్ లో కిరాణ దుకాణం, ఎరువుల దుకాణం, ఆలయ హుండీని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని దుండగుడు షట్టర్ల తాళాలు పగులగొట్టి అందినకాడికి నగదు దోచుకెళ్లాడు. లక్ష్మాపూర్లో కిరాణా దుకాణం యజమాని గురువారం రాత్రి షాపు మూసి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో దుండగుడు షట్టర్ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. ఫర్టిలైజర్ దుకాణం తాళాలు పగలగొట్టి సుమారు 40 వేల వరకు నగదు దోచుకెళ్లాడు. గ్రామపంచాయతీ ముందు ఉన్న శివాలయంలోని హుండీని పగులగొట్టి అందులోని డబ్బులను తీసుకుని, హుండీని కాళీ ప్రదేశంలో పడేసి వెళ్లాడు. ఉదయం షాపులు తెరవడానికి వచ్చిన యజమానులు తాళాలు విరిగివుండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగతనానికి గురైన దేవాలయం ఉండిని పరిశీలించారు. గ్రామంలో చోరీకి పాల్పడిన సంఘటనలు కొన్ని సీసీ కెమెరాలు దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**జయభేరి, భూపాలపల్లి జిల్లా :**




భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ & భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగను ప్రజలతో కలిసి ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహిళల సృజనాత్మకత, మన సంస్కృతి ఉట్టిపడేలా ఎంతో అద్భుతంగా ముగ్గులు వేశారన్నారు. ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలను ప్రోత్సహిస్తూ, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రోత్సాహం ఇవ్వడమే కాకుండా, తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు బిఆర్ఎస్ పార్టీ నిరంతరం కట్టుబడి ఉందన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతిఒక్కరికి బహుమతి రాకపోవచ్చు, అంత మాత్రాన ఎవరూ బాధపడవద్దన్నారు. ఓజ్జపల్లి సుమలత మొదటి బహుమతి రూ. 5016/, తోట సిరివల్లి రెండవ బహుమతి రూ. 3016/, సిహెచ్ తిరుపతి మూడవ బహుమతి రూ.2016 లను గెలుచుకున్నారు. అదే విదంగా మొదటి ఐదుగురు దివ్య, మల్లీశ్వరి, శైలజ,రమ్య, స్వర్ణలత కన్సలేషన్ ప్రైజ్ రూ. 1000/ చొప్పున గెలుపొందగా పోటీలో పాల్గొన్న ప్రతిఒక్కరికి బహుమతి అందచేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపాలిటీ మహిళలు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## చెన్నపార్య శతకం


ఆ.వె.మొదట మీరు జేసి ముత్యాల సరముల
ఉపనిషత్రయమును; ఉత్సహించి
నవ్య మార్గమొకటి నాకు చూపినారు
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!

ఆ.వె.అట్టి మార్గమందు అరిగిన వాడనై
సంతరించి ఉపనిషత్తులేడు,
అందు మీకునొకటి అంకిత మొసగితి
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!

ఆ.వె.దర్శనాల గొప్పతనమును వివరించి
జ్ఞానమొసగినారు నయముగాను
ధర్మ మెఱగి నేను ధరణిలో నుంటిని
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!

ఆ.వె.బస్సులోన మొదటి పయనమ్ము మీతోడ
మూడు గంటలలరె ముచ్చటంప
మధురమయ్యె మనసు మాటలు వినగానె
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!

ఆ.వె.మాదు గృహమునందు మా కోర్కె మేరకు
వచ్చి ఉన్నవారు వారమనక
సంతసమున గడిచె సమయంబు మాకెల్ల
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!



**జక్కని వేంకటరాజం**
సిరిసిల్ల. 94400 21734



# పశు వైద్య కేంద్రం గుడిపల్లి అని పేరు రాపీయడం

**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండల హెడ్ కోటర్స్ గుడిపల్లి గ్రామంలో 1994 సంవత్సరంలో నిర్మితమైనటువంటి పశువైద్యశాల సంబంధించినటువంటి భవనంపై ప్రాథమిక పశు వైద్య కేంద్రం గుడిపల్లి అని పేరు రాయకపోవడంతో పశువైద్య అధికారి అయిన శివ నాగ మల్లేశ్వరి నూతన సర్పంచ్ అయిన కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన సర్పంచ్ నూతనంగా మండల పశు వైద్య పశుసంవర్ధక శాఖ వారి కార్యాలయం ప్రాథమిక పశు వైద్య కేంద్రం గుడిపల్లి అని పేరుని సంబంధిత ఆర్టిస్టుతో రాయించడం జరిగింది. ఇట్టి విషయంలో సంబంధిత పశు వైద్య అధికారి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసినారు.

# సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా కేతావత్ రమేష్



**జయభేరి, దేవరకొండ :**

సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా కేతావత్ రమేష్ చందంపేట మండలం యాపలపాయ తండా వాసి నీ నియమించిన సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్ నియమకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్ కి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి M.నరేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సమాచార హక్కు చట్టం 2005 ద్వారా ప్రజలకు సేవ చేయడానికి తగినంత సమయం కేటాయించి ప్రచార్ సమితి ఆశయాలను ముందుకు తీసుకెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నియోజవర్గ ప్రచార కార్యదర్శి సభవత్ గోవిందు నాయక్, నేరేడుగుమ్ము మండల అధ్యక్షులు ఆంజనేయులు మరియు కొర్ర శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మేకలకు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 10 :**

తుర్కపల్లి మండలం జేతురామ్ తండా, మోతీరాం తండా గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచులు భూక్య సంతోష్ కుమార్ నాయక్, ధరావత్ కమ్లి లు కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ అవకాశాన్ని గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ మందుల వల్ల గొర్రెలలో అంతర్పరాన్న జీవులు నశించి, అధిక బరువు, వ్యాధి నిరోధక శక్తి ,పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. రెండు గ్రామాల్లో 794 గొర్రెలు, మేకలకు ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు భూక్య సక్కుబాయి, బానోతు రాములు, ధరావత్ సురేష్, పశువైద్య సిబ్బంది రాఘవేంద్ర, శంషాద్దీన్, పెండెం ప్రవీణ్, వీరు, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

# భారతదేశ ఆధ్యాత్మిక–సాంస్కృతిక గౌరవానికి ప్రతీక

- పవిత్ర క్షేత్రం సోమనాథ్ ఆలయం.. నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్



**జయభేరి, నాగోల్ :**

భారతీయ సంస్కృతి, శైవ సంప్రదాయం, శివభక్తుల సంకల్పబలం ఎప్పటికీ ఓడిపోలేదని చాటిచెప్పే మహత్తర చిహ్నమే సోమనాథ్ క్షేత్రం. ఆ మహనీయ స్ఫూర్తిని ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పే ఉద్దేశంతో నాగోల్ డివిజన్ పరిధిలోని శివపురి కాలనీ సమీపంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నాగోల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పంగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించగా, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపారాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ హాజరై, బీజేపీ నాయకులతో కలిసి శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశ ఆధ్యాత్మిక-సాంస్కృతిక గౌరవానికి ప్రతీకగా నిలిచిన సోమనాథ్ క్షేత్రంపై చరిత్రలో ఎన్నో దాడులు జరిగినప్పటికీ, శివభక్తుల అచంచల విశ్వాసం, అజేయ సంకల్పబలంతో తిరిగి లేచి నిలిచిన పవిత్ర క్షేత్రం సోమనాథ్ ఆలయమని తెలిపారు. సోమనాథ్ ఆలయం భారతీయ సంస్కృతి యొక్క జీవంతత్వానికి, శైవ సంప్రదాయ వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని, దేశ ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, సాంస్కృతిక గర్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ విధమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని, యువత భారతీయ సంప్రదాయాల పట్ల మరింత ఆకర్షితులయ్యేలా చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, బీజేవైఎం నాయకులు, కాలనీ వాసులు, శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

